



# కరపత్రం

SINCE 2014

మంగళవారం సెప్టెంబర్ 30 2025 సంపుటి :0 సంచిక :342 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## సరూర్‌నగర్ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్: సరూర్‌నగర్ మైదానంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్టేడియంలో 66.5 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. మొత్తం 1500 మంది మహిళలతో బతుకమ్మ ఆడించి.. గిన్నిస్ రికార్డు దిశగా పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళలతో కలిసి ఆటపాటలతో అలరించారు. బతుకమ్మ చుట్టూ నిల్చొని పాటలు పాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి తెలంగాణ నెలవు అని పేర్కొన్నారు. కష్టసుఖాలను పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండగ నిదర్శనమని చెప్పారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజాప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

# మళ్లీ 'మెలోడీ' మూమెంట్

## జార్జియా మెలోనీ ఆత్మకథకు మోదీ ముందుమాట

**దిల్లీ: భారత్, ఇటలీ ప్రధానులు నరేంద్రమోదీ, జార్జియా మెలోనీ మంచి స్నేహితులు . అంతర్జాతీయ వేదికలపై వారిద్దరూ కలుసుకొన్నప్పుడు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటుంటారు. ఈ స్నేహంతో మెలోనీ పుస్తకానికి మోదీ ముందుమాట రాశారు.**

'I Am Giorgia — My Roots, My Principles' పేరిట రాసిన మెలోనీ ఆత్మకథ ఇండియన్ ఎడిషన్‌ను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురానున్నారు. దీనిని 'హర్ మన్‌కీ బాత్' అని అభివర్ణించిన ప్రధాని మోదీ.. ముందుమాట రాశారు. అది తనకు దక్కిన గొప్ప గౌరవం అని ఎక్స్ వేదికగా వెల్లడించారు. "పీఎం మెలోనీ జీవితం, నాయకత్వం కాలంతో సంబంధం లేని సత్యాలను మనకు గుర్తుచేస్తాయి. ఈ ఉత్తేజకర జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుంది" అని రాసుకొచ్చారు. సాంస్కృతిక వారసత్వం, సమానత్వంపై ఆమెకు అమితమైన విశ్వాసం ఉందని కొనియాడారు. ఎన్నో అంశాల్లో ఇరుదేశాల మధ్య సారుప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు.

యుద్ధభూమిలోనూ.. మైదానంలోనూ ఒకటే ఫలితం: ప్రధాని మోదీ



ఈ బుక్ అసలు వెర్షన్ 2021లోనే పబ్లిష్ అయి, బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. అప్పుడు మెలోనీ విపక్షంలో ఉన్నారు. 2025, జూన్‌లో దీనిని అమెరికాలో విడుదల చేశారు. అప్పుడు దానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు ముందుమాట రాశారు. ఈ పుస్తకంలో మెలోనీ తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఎన్నికల ప్రచార సమయంలో గర్భిణిగా, అవివాహితురాలైన తల్లిగా ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు.

కాగా.. మోదీ, మెలోనీలు దిగిన ఫొటోలు ఎప్పుడూ నెట్టింట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్న సంగతి తెలిసిందే. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా జరిగిన 'కాప్ 28' సదస్సు సందర్భంగా వీరిద్దరూ సెల్ఫీ తీసుకున్నారు. దీన్ని మెలోని ఎక్స్‌లో షేర్ చేశారు. దానికి మెలోడీ (ఇద్దరి పేర్లలోని అక్షరాలు కలిసేలా) అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. అప్పటినుంచి ఈ #Melodi పదం ట్రెండ్ అయ్యింది. నాటి ఫొటోపై ప్రధాని మోదీ కూడా స్పందిస్తూ.. "స్నేహితుల్ని కలుసుకోవడం ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటుంది" అని బదులిచ్చారు. ఇటలీ, కెనడాలో జరిగిన జీ7 సదస్సులోనూ వీరు దిగిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి.

- **పుస్తకం పేరు:** 'I Am Giorgia — My Roots, My Principles'
- **ఎడిషన్:** ఈ పుస్తకం యొక్క ఇండియన్ ఎడిషన్ త్వరలో మార్కెట్‌లోకి రానుంది.
- **ముందుమాట:** భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ ఇండియన్ ఎడిషన్‌కు ముందుమాట రాశారు.
- **మోదీ అభివర్ణన:** ప్రధాని మోదీ దీనిని 'హర్ మన్‌కీ బాత్' అని అభివర్ణించారు.
- **గౌరవం:** ముందుమాట రాయడం తనకు దక్కిన గొప్ప గౌరవం అని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.
- **మోదీ సందేశం:** మెలోనీ జీవితం, నాయకత్వం కాలంతో సంబంధం లేని సత్యాలను గుర్తుచేస్తాయని, సాంస్కృతిక వారసత్వం, సమానత్వంపై ఆమెకు విశ్వాసం ఉందని, ఆమె జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుందని మోదీ పేర్కొన్నారు.
- **సాదృశ్యాలు:** ఎన్నో అంశాల్లో ఇరుదేశాల మధ్య సారుప్యతలు ఉన్నాయని మోదీ తెలిపారు.

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

2లో

**సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ**

**ప్రభుత్వంపై బిఆర్ఎస్ బురద జల్లుతూ విమర్శలు**

**మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు.

# ఎన్నికలు ఏవైనా ఎదుర్కొనేందుకు మేం సిద్ధం: కేటీఆర్




**'బాకీ కార్డులు' వ్యూహం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోయారని ఆ పార్టీ అనుకుంటుంది, కాబట్టి వారి గ్యారంటీ కార్డులను గుర్తుచేసేందుకు BRS 'బాకీ కార్డులను' తీసుకువచ్చిందని తెలిపారు.**

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికలు ఏవైనా తమ పార్టీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. గల్లీ నుంచి దిల్లీ వరకు ఏ ఎన్నికైనా తమకు అనుకూలమే అని చెప్పారు. "కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోయారని అనుకుంటోంది.

2లో

# 42 శాతం రిజర్వేషన్ల

## అమలుకు అందరూ సహకరించాలి: పొన్నం ప్రభాకర్



మిగతాది 2లో

- హామీ: రిజర్వేషన్ల అమలు వల్ల ఎవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు.
- రిజర్వేషన్ల పరిమితిపై వివరణ: 50 శాతం రిజర్వేషన్ల పరిమితి గురించి కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, అయితే అందులో మార్పులు చేసుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందని తెలిపారు.
- ప్రభుత్వ చర్యలు: న్యాయపరంగా, చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు.

## ఆయనే బ్యాటింగ్ చేసినట్లు అనిపించింది: సూర్యకుమార్



2లో

## మదుపర్ల అప్రమత్తత.. ఏడోరోజూ నష్టాల్లో సూచీలు



2లో

# 500 సినిమాల పైరసీ..

**బిహార్‌లోని ఇంటికి 22 సీసీ కెమెరాలు: సీపీ సీవీ ఆనంద్**



దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు

2లో

## తెలంగాణలో మోగిన స్థానిక ఎన్నికల నగారా..



**షెడ్యూల్ ఇదే**

2లో

## ఉదయమే జనం వచ్చినా..

కావాలనే విజయ్ ఆలస్యంగా: కరూర్ తొక్కిసలాటపై ఎఫ్ఐఆర్

పేజ 2లో ▶

## తమ్ముడు తిలక్ వర్మ బహుమతి..

నాకెంతో ప్రత్యేకం: మంత్రి నారా లోకేశ్

పేజ 2లో ▶

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 30 2025

## గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించామన్నారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

## ఉదయమే జనం వచ్చినా..



మొదటిపేజీ తరువాయి

చెన్నై: కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచారసభలో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు . విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

"విజయ్ ర్యాలీ శనివారం ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సి ఉంది. 11 గంటలకు భారీ ఎత్తున జనం తరలివచ్చారు. మధ్యాహ్నం ఆయన అభిమానులను ఉద్దేశించి మాట్లాడాల్సి ఉంది. కానీ ఆయన సాయంత్రం ఏడు గంటలకు వచ్చారు. భారీ జనసందోహాన్ని చూపించేందుకే ఉద్దేశపూర్వకంగా ఆయన ఆలస్యంగా వచ్చారు. దానివల్ల ప్రజలు అలా ఎండలో నిల్చొని అలసిపోయారు. విజయ్ వస్తోన్న బస్ షెడ్యూల్‌కు భిన్నంగా పలుచోట్ల ఆగింది. వాటికి ఎలాంటి అనుమతి లేదు. అది అలా ఆగడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అక్కడ గుమిగూడిన వారికి ఆహారం, మంచినీళ్లు, ఇతర సౌకర్యాలు అందుబాటులో లేవంటూ వచ్చిన హెచ్చరికలను నటుడితో పాటు సీనియర్ నాయకుడు ఎన్ ఆనంద్ విస్మరించారు. ఇక ఏడు గంటలకు విజయ్ వచ్చే సరికి ఆ జనసమూహాన్ని నిర్వహించడం కష్టమైపోయింది. అది తొక్కిసలాటకు దారితీసింది" అని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. పార్టీ జిల్లా సెక్రటరీ మథియాళన్, స్టేట్ జనరల్ సెక్రటరీ ఆనంద్, స్టేట్ జాయిట్ సెక్రటరీ సీటీఆర్ నిర్మల్ కుమార్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ తొక్కిసలాటకు సంబంధించి సోషల్ మీడియాలో షేర్ అయిన వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారని సమాచారం. తప్పుడు సమాచారవ్యాప్తి వల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకే ఆ పరిశీలన అని తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో కుట్రకోణం ఉందని, స్వతంత్ర దర్యాప్తు జరపాలంటూ టీవీకే మద్రాస్ హైకోర్టు ను ఆశ్రయించింది.

## తమ్ముడు తిలక్ వర్మ బహుమతి..



మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆసియా కప్ ఫైనల్ హీరో, భారత క్రికెటర్ తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాను ఉపయోగించిన క్యాప్‌ను లోకేశ్‌కు ప్రేమతో ఇస్తున్నట్లు తిలక్‌వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు తిలక్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

తిలక్ వర్మ బహుమతికి మంత్రి లోకేశ్ ముగ్ధుడయ్యారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "తమ్ముడు తిలక్ వర్మ బహుమతి నాకెంతో ప్రత్యేకమైంది. స్వదేశానికి వచ్చాక అతడి చేతుల మీదుగానే క్యాప్ తీసుకుంటా"అని పేర్కొన్నారు. క్యాప్‌పై తిలక్ వర్మ సంతకం చేస్తున్న వీడియోను ఈ సందర్భంగా లోకేశ్ షేర్ చేశారు. ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

## ఆయనే బ్యాటింగ్ చేసినట్లు అనిపించింది: సూర్యకుమార్

మొదటిపేజీ తరువాయి

ఆసియా కప్ ఫైనల్ లో పాకిస్థాన్‌ను భారత్ మట్టికరిపించడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించిన సంగతి తెలిసిందే. "మైదానంలోనూ 'ఆపరేషన్ సిందూర్'. ఎక్కడైనా ఫలితం ఒక్కటే. ఇండియా గెలిచింది. భారత క్రికెటర్లకు అభినందనలు" అని మోదీ పోస్టు పెట్టారు. దీనిపై టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సోమవారం స్పందించాడు. స్వయంగా దేశ ప్రధానియే ముందు వరుసలో ఉండి ప్లేయర్లకు మద్దతు తెలపడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నాడు. టీమ్ఇండియాకు హారిస్ రవూఫ్ 'రన్ మెషీన్'!.. పాక్ పేసర్‌పై వసీమ్ అక్రమ్ విమర్శలు

'దేశ నాయకుడు స్వయంగా ముందు వరుసలో ఉండి బ్యాటింగ్ చేసినప్పుడు చాలా బాగుంటుంది. ఆయన బ్యాటింగ్‌కు వచ్చి పరుగులు చేసినట్లు అనిపించింది. ఇది చూడటానికి చాలా బాగుంది. సార్ ముందు నిలబడి ఉన్నప్పుడు కచ్చితంగా ఆటగాళు స్వేచ్ఛగా ఆడతారు. ముఖ్యమైన విషయం ఏంటంటే మేం (భారత జట్టు) స్వదేశానికి వెళ్లినప్పుడు దేశం మొత్తం సంబరాలు చేసుకుంటుంది. ఆ అనుభూతి చాలా బాగుంటుంది. దాంతో మేం మరింత ప్రేరణ పొందుతాం' అని సూర్యకుమార్ ఓ న్యూస్ ఏజెన్సీతో అన్నాడు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు 'ఆపరేషన్ సిందూర్'తో గుణపాఠం చెప్పింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలు లక్ష్యంగా చేసుకుని క్షిపణుల వర్షం కురిపించింది. అనంతరం భారత్‌పై పాక్ దాడులు చేయడంతో తిప్పికొట్టింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించడంతో క్రికెట్ అభిమానులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ప్రతి ఒక్కరూ భారత క్రికెటర్లపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మదుపర్ల అప్రమత్తత.. ఏడోరోజూ నష్టాల్లో సూచీలు

మొదటిపేజీ తరువాయి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా ఏడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీ.. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధాన సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైన వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో సూచీలు స్వల్ప నష్టాలతో మగిశాయి.ఉదయం సెన్సెక్స్ 80,588.77 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,426.46) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,248.84 – 80,851.38 మధ్య చలించింది. చివరికి 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19.80 పాయింట్ల నష్టంతో 24,634.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.76గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. టైటాన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎటెర్నల్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.01 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3810 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## తెలంగాణలో మోగిన స్థానిక ఎన్నికల నగారా..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో స్థానిక ఎన్నికల కు నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణికుముదిని వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. (%ువశ్రీఖఅస్త్రుఖఅఖ ాశీఝశ్రీ దీశీ౨ఎ జుశ్రీవష్ఱశీఅం ాఎష్ట్రవ౨బశ్రీవ%) రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు.

**ముఖ్యమైన తేదీలివే..**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు– తొలివిడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11
పరిశీలన: అక్టోబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 15
ఎన్నికల తేదీ– అక్టోబర్ 23
ఓట్ల లెక్కింపు– నవంబర్ 11

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు– రెండో విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15
పరిశీలన: అక్టోబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 19
ఎన్నికల తేదీ– అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు– నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికలు– తొలి విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19
పరిశీలన: అక్టోబర్ 20
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు– అక్టోబర్ 31

గ్రామ పంచాయతీ ఎన్నికలు– రెండో విడత
నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 21
చివరి తేదీ: అక్టోబర్ 23
పరిశీలన: అక్టోబర్ 24
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 27
ఎన్నికల తేదీ, ఫలితాలు– నవంబర్ 4

గ్రామ పంచాయతీ ఎన్నికలు– మూడో విడత
నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 25
చివరి తేదీ: అక్టోబర్ 27
పరిశీలన: అక్టోబర్ 28
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 31

## 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ సహకరించాలి: పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అందరూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల వల్ల ఎవరికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. " 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఉందని కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. దానిలో మార్పులు చేసుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకెళ్తున్నాం. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలు కూడా రిజర్వేషన్లకు మద్దతిచ్చాయి. మళ్లీ మాట మార్చకుండా ప్రభుత్వానికి సహకరించాలి. అందరి మద్దతుతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇదే విషయాన్ని న్యాయస్థానంలోనూ ప్రస్తావిస్తాం" అని పొన్నం తెలిపారు.


## ఎన్నికలు ఏవైనా ఎదుర్కొనేందుకు మేం సిద్ధం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

వారి గ్యారంటీ కార్డులను గుర్తుచేసేందుకు.. మేము 'బాకీ కార్డులను' తీసుకువచ్చాం. వీటిద్వారా ఆ పార్టీ బాకీలను ఇంటింటికీ చేర్చడానికి ఉద్యమించాం. 'బాకీ కార్డులు' ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం. కేసీఆర్‌ను తిరిగి తెచ్చుకోవాలనే ఆలోచన ప్రజల్లో కనిపిస్తోంది. ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఉద్ధరించే పరిస్థితి లేదు.. కానీ కొత్త నగరాన్ని కడతామని పోజులు కొడుతున్నారు. మున్సిపల్ శాఖ విషయంలో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారు" అని కేటీఆర్ విమర్శించారు.

## 500 సినిమాల పైరసీ..

మొదటిపేజీ తరువాయి




హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు). ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ ముఠా పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ.3,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనివల్ల నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. "టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా సినిమాల పైరసీ జరుగుతోంది. కొత్తగా ఎంవో విధానంలోనూ చేస్తున్నారు. థియేటర్‌కు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి పైరసీకి పాల్పడుతున్నారు. అందరూ విస్తుపోయేలా డిజిటల్ శాటిలైట్‌ను కూడా హ్యాక్ చేసి పైరసీ చేస్తున్నారు. పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసి బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రకటనల ద్వారా ఆదాయం పొందుతున్నారు. 'సింగిల్', 'హిట్' సినిమాల పైరసీ జరిగినప్పుడు మాకు ఫిర్యాదులు అందాయి. పైరసీ కేసులో జానా కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడు. సినిమాకు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి టెలిగ్రామ్ ఛానల్ ద్వారా మరొకరికి పంపించాడు.

హైఎండ్ కెమెరా ఉన్న సెల్‌ఫోన్‌తో నిందితులు సినిమాను రికార్డింగ్ చేస్తారు. సెల్‌ఫోన్లను జేబులో గానీ, పాప్‌కార్న్ డబ్బాలో గానీ పెడతారు. కిరణ్ ముఠా ప్రత్యేకమైన యాప్ ద్వారా సినిమాలను పైరసీ చేసింది. రికార్డింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ స్క్రీన్‌లైట్ కూడా ఆఫ్‌లో ఉంటుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదు. ఇతర భాషల చిత్రాలను రికార్డింగ్ చేసేందుకు ఏజెంట్లు కూడా ఉన్నారు. సినిమా పైరసీలకు నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వాడుతున్నారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించాం. పోలీసులు ఎప్పటికీ పట్టుకోలేని టెక్నాలజీ వాడుతున్నామని నిందితులు పేర్కొన్నారు. మేం కేసును ఛేదించిన విధానం తెలిసి షాక్ అయినట్లు నిందితుడు చెప్పాడు. అతడికి బెట్టింగ్ యాప్‌ల నుంచి నెలకు సుమారు రూ.9 లక్షల వరకు చెల్లింపులు జరిగాయి.

**డిజిటల్ మీడియా సర్వర్స్ మొత్తం హ్యాక్ చేసే నైపుణ్యం**

క్రిప్టో కరెన్సీ పేమెంట్స్ ద్వారా మాకు కొంత క్లూ దొరికింది. మరో ప్రధాన నిందితుడు పట్నాకు చెందిన అశ్వనీకుమార్ హ్యాకింగ్‌లో నిపుణుడు. డిజిటల్ మీడియా సర్వర్స్ మొత్తం హ్యాక్ చేసే నైపుణ్యం అతడికి ఉంది. కొన్ని సందర్భాల్లో గవర్నమెంటు వెబ్‌సైట్లను కూడా హ్యాక్ చేశాడు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేశాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లు హ్యాక్ చేసి ఉద్యోగులు, జీతాల వివరాలు పొందగలిగాడు. బిహార్‌లో ఉన్న అతని ఇంటికి మా టీమ్ వెళ్లింది. అతని ఇంటికి 22 సీసీటీవీ కెమెరాలు పెట్టుకున్నాడు. పట్నాలో కూర్చుని పలు కంపెనీల సైట్లను హ్యాక్ చేశాడు. నిందితుల వల్ల పలు కంపెనీలు వాళ్ల ఉద్యోగులను అనుమానించే పరిస్థితి వచ్చింది. సినిమాల పైరసీని ప్రధానంగా ప్రోత్సహిస్తున్నది.. బెట్టింగ్, గేమింగ్ యాప్ నిర్వాహకులు. పైరసీ సైట్లలోని లింక్‌లను క్లిక్ చేస్తే యూజర్ వివరాలన్నీ పైరసీ ముఠాకు వెళ్తాయి. డిజిటల్ మీడియా హౌస్‌లు జాగ్రత్తగా ఉండాలి. సినిమా ఫుటేజీని భద్రపరచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలి. సర్వర్‌కు ఒక ప్రొటెక్షన్ చేస్తే.. మరో మార్గంలో వస్తారు. ఎక్కువ సినిమాల పైరసీ కిరణ్, అశ్వనీకుమార్ ముఠా వల్లే జరిగింది.

**పైరసీ ద్వారా లక్ష డాలర్ల వరకు ఆర్జన**

నిందితులు ఈసీ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి ఎన్నికల జాబితాను మాత్రమే చూశారు. పైరసీ ద్వారా నిందితులు లక్ష డాలర్ల వరకు సంపాదించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను హర్షవర్ధన్ అనే వ్యక్తి పైరసీ చేశాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సినిమాలను పైరసీ చేయడంలో సమాజ సేవ ఏమీలేదు. పైరసీలు చేసి బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బు సంపాదించారు. సిరిల్ అనే వ్యక్తి నెదర్లాండ్, ప్యారిస్ ఐపీ అడ్రస్‌లు పెట్టి సినిమాలు పైరసీ చేసి అప్లోడ్ చేస్తున్నాడు. ఇతనికి బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు నెలకు రూ.9లక్షలు ఇస్తున్నారు. ఇప్పటి వరకు 500 సినిమాలు పైరసీ చేసినట్లు గుర్తించాం" అని సీపీ ఆనంద్ తెలిపారు.

## దైవ భక్తి తో పాటు దేశ భక్తి కలిగి ఉండాలి
# - దేశమే దైవం





**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆజాద్ బస్తి యొక్క ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు మరియు దసరా ఉత్సవాన్ని స్వయం సేవకులు ఆదివారం ఎమ్మెస్సార్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ముఖ్య వక్త గంటా తిరుమలజీ మాట్లాడుతూ సమాజంలో దైవభక్తితో పాటు దేశభక్తిని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. ఆర్ఎస్ఎస్ 1925 వ సంవత్సరంలో విజయదశమి నాడు డాక్టర్ హెడ్గేవార్ ప్రారంభించారని ఈ 100 సం.లు గా దేశ భక్తులు గా అనేక మంది యువతను %=ూా% తయారు చేస్తుంది అని అన్నారు. ఈ 100 స.కాలంలో అయోధ్య లాంటి గొప్ప ఉద్యమాన్ని నిర్వహించి రామ మందిరాన్ని నిర్మించామని తెలిపారు అలాగే ఏడు కొండలను రెండు కొండలు గా అప్పటి ప్రభుత్వం చేసినప్పుడు పెద్ద ఎత్తున స్వయం సేవకులు ఉద్యమం చేసి తిరిగి ఏడుకొండలుగా జీవో వచ్చేటట్లు పోరాటం చేశారు. అన్నప్పుడు ప్రజలలోరామ సేతు ఉద్యమంలో కూడా సంఘ్ విశేష కృషి చేసింది. ఈ 100 సం.కాలంలో సందర్భంగా సంఘ్ పంచ పరివర్తన అనే కార్యక్రమాన్ని చేపట్టింది....
నీ కుటుంబాన్ని కాపాడుకోవాలి సమాజంలో అందరినీ సమదృష్టి తో చూడాలి. కుల బేధాలు లేకుండా చూడాలి. సమత, మమత, ఏకత మనలో ఉండాలి.నీ చుట్టూ ఉన్న ప్రకృతి నీ, పర్యావరణాన్ని కాపాడుకోవాలి కులాల వారీగా విడదీయాలని సమాజము లో కొందరు చూస్తున్నారు అలాంటి దుష్ట శక్తుల నుండి మనల్ని మనం కాపాడుకోవాలి అన్నారు స్వదేశీ వస్తువులను సాధ్యమంతా వరకు మన వస్తువులనే మనం వాడాలి. అని తెలిపారు... ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పోచయ్య, తోపారపు నాగయ్య, మానాల రాజారం, సొప్పరి శ్రీనివాస్, రమాకాంత్, భరత్, వంగరి మధుసూదన్ తోపారపు రాజేందర్, పూదరి నరేందర్ గౌడ్, తోకల సత్యనారాయణ, ద్విజేంద్రనాథ్, బత్తుల జగదీశ్వర్ గౌడ్, కోయల్కర్ రాజ్ కుమార్ తదితర స్వయం సేవకులు పాల్గొన్నారు

# రాం నగర్ లో ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు
## - ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు




**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల రామ్ నగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శత జయంతి విజయదశమి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి లోకిని శ్రీనివాస్ ఆర్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించగా, గోల్కొండ నాగరాజు విజయదశమి ప్రాధాన్యం, శక్తి ఉపాసన అవసరాన్ని చాటి చెప్పారు. డాక్టర్ హెడ్గేవార్ 1925లో నాగపూర్‌లో ఐదుగురితో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు.

# ఫంక్షన్ హాల్ నిర్మాణంలో విషాదం
## - యూపి కార్మికుడు మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని గౌడవెల్లిలో జరుగుతున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల్లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. షెడ్ నిర్మాణంలో భాగంగా వాల్ పార్టిషియన్ పని చేస్తున్న ఉత్తరప్రదేశ్కు చెందిన సోయల్ (21) అనే యువ కార్మికుడు విద్యుత్ తీగలను కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాంట్రాక్టర్ సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కోరుట్ల మహాదేవ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అతి పురాతన శ్రీ మహాదేవ స్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా దుర్గాదేవి సరస్వతిమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పిట్టల నరేష్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

# దుర్గామాతకు బోనాలు
## - భక్తి శ్రద్ధలతో సమర్పించిన మహిళలు





**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల పట్టణంలోని దుర్గామాత దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నెత్తిన భోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్యన అంగరంగ వైభవంగా పట్టణంలోని వీధుల గుండా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఆలయ నిర్వాహకులు పెండెం గణేష్, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరికొండలో సామూహిక కుంకుమ పూజలు
## - ఘనంగా దసరా నవరాత్రి వేడుకలు




**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలోని హనుమాన్ వాడ శ్రీ దుర్గామాత సన్నిధిలో సోమవారం రోజున సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పురోహితులు గణపతి పూజ, పుణ్యహ వచనం, మండపారాధన చేసి, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో మైసమ్మ తల్లి
## - సరస్వతి దేవి రూపంలో దర్శనం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మున్సిపల్ పరిధిలో శరన్నవరాత్రులలో భాగంగా ఎనిమిదవ రోజు శ్రీ గడి మైసమ్మ తల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఆలయంలో ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. ఉదయం నుండి మాలధారులు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు

# ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో
## - దాండియా మహోత్సవం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఉప్పల్ మున్సిపల్ స్టేడియం లోని మూడు రోజులగా జరుగున్న దాండియా మహోత్సవం ఆదివారం తో ముగిసింది. చివరి రోజు ఆదివారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలందరూ వర్షం కురుస్తున్న ఆటలు ఆడుతూ, నృత్యాలు చేశారు.ఈ కార్యక్రమంలో లో టాప్ సింగర్ తేజుప్రియ ముఖ్య అతిదిగా పాల్గొన్నారు.సింగర్ పాటలతో మహిళలంతా ఎంతో ఉత్సాహంగా దాండియా ఆడారు .

# వరంగల్ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, సెప్టెంబర్ 29**



సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సాంస్కృతిక జీవన ధార అన్నారు. పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ ఆడపడుచులు ఆనందంగా కలసి పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ ఐక్యత, స్నేహం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. బతుకమ్మలో ప్రతి పువ్వు ఒక ప్రత్యేకత కలిగి ఉంటుందని, అవి జీవన సమతౌల్యాన్ని సూచిస్తాయని ఎంపీ వివరించారు. తల్లి ప్రకృతికి కృతజ్ఞతగా జరుపుకునే ఈ పండుగలో మన సంస్కృతి, సంప్రదాయాలు, స్త్రీ శక్తి ప్రతిఫలిస్తాయని తెలియజేసారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, వారి జీవన ఉత్సాహం ఈ పండుగ ద్వారా ప్రతిఫలిస్తుంది అని అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ కుటుంబాలను, బంధాలను, సమాజాన్ని ఒకే తాటిపైకి తెస్తుందని తెలిపారు. ప్రతి ఇంటా సుఖశాంతులు నిండాలని, తెలంగాణ సంస్కృతి మరింత విశ్వవ్యాప్తంగా వెలుగొందాలని
ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

## రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, సెప్టెంబర్ 29**
తెలంగాణ పూల పండుగ బతుకమ్మ ముగింపు చివరి రోజు “సద్దుల బతుకమ్మ”ను పురస్కరించుకొని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో నుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ పండుగ అని అన్నారు. దేవతలను అర్చించే పువ్వులే బతుకమ్మగా పూజలందుకోవడం తెలంగాణ ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ఆరాధనను, కృతజ్ఞత భావనను తెలియజేస్తుందని తెలిపారు. సబ్బండ వర్గాలు సమిష్టిగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని వెల్లడించారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ రాష్ట్రం నిండైన బతుకమ్మను తలపిస్తున్నదని అన్నారు. గ్రామాల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై తొమ్మిది రోజుల పాటు సాగిన బతుకమ్మ ఆడబిడ్డల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలు సాంస్కృతిక శోభను సంతరించుకున్నాయని అన్నారు. ఈ సందర్భంగా విజయాలను అందించే విజయ దశమిని స్వాగతిస్తూ సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బతుకమ్మల నిమజ్జన సమయంలో స్వీయ జాగ్రత్తలతోపాటు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని జగన్మాత గౌరీదేవిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రార్థించారు.

# బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, సెప్టెంబర్ 29**
ఐనవోలు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలను ఈ పూల పండుగ ప్రతిబింబిస్తుందని తెలిపారు. అనంతరం బతుకమ్మలను ఎంతో అందంగా అలంకరణ చేసిన మహిళలకు చైర్మన్ చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం
## -ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా సంగారెడ్డి జిల్లా జోగిపేట పబ్బతి హనుమాన్ దేవాలయం వద్ద స్నేహ, సిరి, మాత యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాదా ఈ మండపంలోని అమ్మవారిని బీఆర్ఎస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు పులుగు గోపాల్ రావు తదితరులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం మండప నిర్వహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్లు డిబి.నాగభూషణం, మల్లిఖార్జున్, గంగా జోగినాథ్, మాజీ ఎంపీపీ రామ గౌడ్, బీఆర్ఏస్ సీనియర్ నాయకులు చాపల వెంకటేశం, మహేష్ యాదవ్, రొయ్యల సత్యం, సాయిలు, అకుల శంకర్, దిలీప్ జైన్, రమణ, నర్సింలు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 30 2025

# రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ లో ఉచిత గుండె వ్యాధి శిబిరం విజయవంతం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 29**

ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ రెనే హాస్పిటల్ గుండె వ్యాధుల విభాగం ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉచిత గుండె వైద్య శిబిరం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి శిబిరానికి ప్రజల వద్ద నుండి అనూహ్య స్పందన లభించింది. గుండె జబ్బులతో ఇబ్బంది పడుతున్న సుమారు 250 మంది పెద్దలు , పిల్లలు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దినకర్ తాటిమట్ల, రోబోటిక్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ సిరిపురపు రవికుమార్, చిన్న పిల్లల గుండె వైద్యులు డాక్టర్ రాజా విజేందర్ రెడ్డి లు ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సంబంధిత పరీక్షలు నిర్వహించి, గుండె జబ్బులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి శిబిరానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించగా, ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ జి వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీన లు విశిష్ట అతిధులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని



ఏర్పాటు చేసిన రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న రెనే హాస్పిటల్ గుండె వైద్యులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ ఇలాంటి ఒక మంచి సేవా కార్యక్రమం నిర్వహించడానికి అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ , కరీంనగర్ జిల్లా సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ జి వీరారెడ్డి , డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ కి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తు లో ప్రభుత్వం చేసే ఇలాంటి వైద్య సేవా కార్యక్రమాల్లో తప్పకుండా రెనే వైద్య సంస్థలు



తమవంతు సహకారం అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్ర చారి, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ అభిలాష్ రెడ్డి, శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్ రెడ్డి, ఇనుగుర్తి రమేష్, వడకపురం జగదీశ్వరా చారి, తిరుపతి రెడ్డి, టీఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డి లతో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద పెరాలసిస్ పేషెంట్ కు భరోసా నిత్యవసర వస్తువులు అందజేత

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 29:**
గోదావరిఖని విటల్ నగర్ లో గత కొంతకాలంగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన కుడప పోషం పెరాల్సిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. తినడానికి తిండి లేక పడుకోవడానికి దిండు లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న విషయాన్ని తెలుసుకున్న భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమ దాతలు మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ బాపన్న ఆర్థిక సహకారంతో పలువురు పుర ప్రముఖుల సమక్షంలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులతో పాటు తన దీనావస్తాను చూసి చెలించి ఎయిర్ బెడ్ ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం భరోసా ఆర్గనైజర్ నసీమ మాట్లాడుతూ నిరుపేద



నిస్సహాయ కుటుంబానికి చెందిన కడప పోచం గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్న విషయం చాలా బాధాకరమని, తన దీన పరిస్థితిని తెలుసుకొని వారికి అండగా ఉండాలనే ఆలోచనతో బాపన్న ఆర్థిక సహాయంతో నిత్యావసర వస్తువులతో పాటు బెడ్ ని అందజేయడం జరిగిందని, మానవత్వంతో ముందుకు వచ్చి నిస్సహాయ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించిన బాపన్నకి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అలాగే కుడుప పోచం అనారోగ్య పరిస్థితి కుదుటపడాలని మామూలు మనిషిగా బాగు కావాలని ఆ దేవుని కోరుకుంటున్నానని, నేను పిలవగానే మంచి మనసుతో విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపాటు. ఈ కార్యక్రమంలో భరోసా ఫౌండర్ నసీమతో పాటు రజియా, బాబు మియా, కుంట సది, మునక్కా, ప్రముఖ సంఘ సేవకులు బొల్లం మధు బాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు పగడ్బందీగా ఏర్పాట్లు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్







**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మెదక్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు అయిన ఎంపీటీసీ, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్ ,కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలైన ఎంపీటీసీ ,జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిందని, నేటి నుంచి జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ లో సరైన వసతులు కల్పించాలన్నారు. అధికారులను మహాత్మ జ్యోతిబా పాఠశాలలో ఉన్న గదులు, సెక్యూరిటీ, మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆది లక్ష్మీనారాయణ రాజరాజేశ్వర శివాలయంలో సద్దుల బతుకమ్మ సంబరాలు.





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మెదక్ జిల్లా నర్సాపూర్ లక్ష్మీనారాయణ శివాలయం ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు సోమవారం సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. 9 రకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చిన శ్రీ ఆది లక్ష్మీనారాయణ రాజరాజేశ్వర శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సాంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. గౌరమ్మగా కొలిచే బతుకమ్మ సంబరాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బతుకమ్మ ఆటల అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేస్తామని మహిళలు తెలిపారు.

## గ్రూప్ వన్ ఫలితాల్లో సత్తా చాటిన యువకుడికి సన్మానం

**– యువత పట్టుదలతో కష్టపడితేనే ఫలితం**
**– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గీత కార్మిక కుటుంబానికి చెందిన విష్ణువర్ధన్ అనే యువకుడు గ్రూప్ వన్ ఫలితాల్లో 189వ ర్యాంకు సాధించి సిద్ధిపేట కలెక్టరేట్లో అసిస్టెంట్ ఆడిటర్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టడంతో సోమవారం ప్రభుత్వ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యువత కష్టపడితేనే విజయం సాధిస్తారని, పట్టుదలతో కష్టపడ్డ వారికి విజయం బానిస అవుతుందని అన్నారు.



## పాట్నా హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ కార్యవర్గం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ దర్శనానికి విచ్చేసిన పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తిని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ యాదవ్ సమక్షంలో సోమవారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం బార్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, గుజ్జే మనోహర్,కనికరపు శ్రీనివాస్, గుడిపల్లి మహేష్ తదితరులున్నారు.

## కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ను కలిసిన రాజన్న ఆలయ ఈవో





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎం. హరిత ను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి పూల మొక్క అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేష్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ కు వేద ఆశీర్వచనం అందజేయగా, ఈవో రమాదేవి లడ్డు ప్రసాదం అందజేశారు. తదనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గోశాల పర్యవేక్షకులు విజయ్, అకౌంట్స్ అడ్వైజర్ ఆగమరావు అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎం. హరిత

**– శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు**



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా ఎం. హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ గా ఎంపికైన శివశంకరను అభినందించిన జిఎం



**జాతీయ భూమి ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 29:**
ఇటీవలే ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో సింగరేణి ఉద్యోగి అర్జీ 3 ఓసి 1 ఇపి ఆపరేటర్ తుంగపిండి ఆనంద్ కుమారుడు శివశంకర వరప్రసాద్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ గా మంచిర్యాల జిల్లాలో పోస్టింగ్ పొందారు. ఈ సందర్భంగా అర్జీ1 జిఎం డి.లలిత్ కుమార్ వారిని శాలువాతో సత్కరించారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఉన్నత స్థానాలకు వెళ్లినట్లయితే వాళ్ల తల్లిదండ్రులకు, సింగరేణికి కూడా గర్వకారణం అని అన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు కష్టపడి చదివి మంచి ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్ రెడ్డి, వీరా రెడ్డి, మల్లేష్, రమేష్ కుమార్, మల్లేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లులను గవర్నర్ వెంటనే ఆమోదించాలి

**▶ జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి**

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, సెప్టెంబర్ 29**
బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజభవన్ కు పంపించిన బీసీ బిల్లులను వెంటనే ఆమోదించాలి జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తూ బీసీ రిజర్వేషన్లను 42% పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును గవర్నర్ ఆమోదించే విధంగా బీజేపీ పార్టీ నేతలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. బీసీ రిజర్వేషన్లను అగ్ర కులాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలు తమ ఓటు ద్వారా వారిని తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.